

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శనివారం 26 ఏప్రిల్ 2025





పదవులు దక్కేదెవరికి?

- కొత్తగా చేరిన వారికి కాంగ్రెస్ అధిష్ఠానం షాక్
- 2017 తర్వాత పార్టీలో చేరినవారికి మొండిచేయి
- పలువురు నేతలకు ఆశాభంగం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అధికార కాంగ్రెస్‌లో పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఆ పార్టీ అధిష్ఠానం ఆశావహులకు ఊహించని షాక్ ఇచ్చింది. 2017కు ముందు నుంచి పార్టీలో ఉన్నవారికి పెద్దపీట వేయాలని, ఆ తర్వాత పార్టీలో చేరిన వారికి తర్వాత ప్రాధాన్యం దక్కుతుందని చెప్పడంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని, కరీంనగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్న వారికి ఆశాభంగం ఎదురవుతు న్నది. పార్టీ రాష్ట్ర రాజకీయాల వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నాలుగు రోజుల క్రితం గాంధీభవన్‌లో సమావేశం నిర్వ హించి ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున పరిశీలకులను నియమించారు. వారిని పార్టీ గ్రామ, మండల, బ్లాక్, పట్టణ కమిటీలకు అధ్యక్షులుగా, ఇతర పదవుల్లో బాధ్యులను నియమించడానికి పేర్లను సూచించాలని, క్షేత్ర స్థాయికి వెళ్లి పార్టీకి చెందిన క్యాడర్‌తో మాట్లాడి 2017కు ముందు పార్టీలో ఉన్న వారి పేర్లను మాత్రమే పదవులకు నామినేట్ చేసేందుకు ప్రతిపాదించాలని తెలిపారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత పార్టీలో చేరిన వారికి కాకుండా మొదటి నుంచి పార్టీలో ఉంటూ అధికారంలో లేకముందు పార్టీని వెన్నంటి ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యంగా అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నది. దీనిలో మార్పునకు తావే లేదని ఆమె పరిశీలకులుగా నియ మించినవారికి, ఇతర నాయకులకు తేల్చి చెప్పారు. దీంతో జిల్లాలో పార్టీ పదవులు ఆశిస్తున్న వారికి నిరాశే ఎదురయ్యే పరిస్థితి కల్పిస్తున్నది.

● ఆశావహులందరూ కొత్త వారే..

ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో ఉన్న డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ శాసనసభ్యుడిగా ఎన్నికవడంతో అయన స్థానంలో మరొకరికి అవకాశం కల్పించాలని అధిష్ఠానం భావిస్తున్నది. ఈ పదవి కోసం వెలిచాల రాజేందర్ రావు, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, పత్తి కృష్ణారెడ్డి, మెన్నేని రోహిత్ రావు, పురుమల్ల శ్రీనివాస్ పోటీ పడుతు న్నారు. వారు శాసన సభ్యులు, జిల్లా మంత్రుల వద్దకు వెళ్లి తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాజేందర్‌రావు కాంగ్రెస్ పార్టీకి చెందిన కరీంనగర్ మాజీ కార్పొ రేటర్లను, పలువురు నాయ కులను కలిసి తనకు మద్దతు ప్రకటించాలని కోరగా, వారంతా ఆయనకు మద్దతుగా గాంధీ భవన్‌కు వెళ్లి నేతలను కలిశారు. ఆశావహులంతా వారివారి పరిచయాలను బట్టి వివిధ కోణాల్లో ప్రయత్నాలు చేశారు. అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం ఆశావహులుగా ఉన్నవారికి ఊహించని షాక్ ఇచ్చింది. వీరిలో రాజేందర్‌రావు, పురుమల్ల శ్రీనివాస్ ప్రస్తుతం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా ఉన్నారు. రాజేందర్‌రావు కాంగ్రెస్‌కు చెందినవారే అయినా మధ్యలో ప్రజారాజ్యం పార్టీ, బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి వచ్చారు. పురుమల్ల శ్రీనివాస్ కూడా ఇతర పార్టీల్లోకి వెళ్లి వచ్చి మళ్లీ కాంగ్రెస్‌లో చేరినవారే. పత్తి కృష్ణారెడ్డి సీపీఎం నుంచి కాంగ్రెస్‌లో చేరారు. రోహిత్‌రావు మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎం సత్యనారాయణరావు మనుమడే అయినా ఆయన గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయా ల్లోకి వచ్చారు. వీరంతా అధి ష్ఠానం కొత్తగా సూచించిన నిబంధన పరిధిలో ఇమడకపోవడంతో పోటీ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వైద్యుల అంజన్‌కుమార్, కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ప్రస్తుతం పోటీలో ఉండే అవకాశం ఉన్నది. పరిశీలకులు వచ్చి పార్టీ కేడర్ అభిప్రాయాన్ని

(మిగతా 8వ పేజీలో)

● కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పుపై చర్చ

ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఉత్తర, దక్షిణ ధృవాలుగా ఉంటున్నారు. నేతలకు పార్టీ పదువులపై ఒకరు చెప్పిన దానికి మరొకరు భిన్నంగా చెప్పే అవకాశం ఉన్నందున అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని పార్టీ శ్రేణులకు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పురుమల్ల శ్రీనివాస్ ఉన్నారు. ఆయనను మార్చుతామని ఎవరు అధికారికంగా ప్రకటించకపోయినా ఊహాగానాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యతిరేకంగా పురుమల్ల గళం విప్పడంతో ఆయనకు పార్టీ క్రమశిక్షణ సంఘం సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేసింది. ఆయన జవాబు ఇచ్చారు. క్రమశిక్షణ కమిటీ నుంచి ఏ ప్రకటన రాకపోయినా నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చుతారంటూ పార్టీ వర్గాల్లో ప్రచారం ఊపందుకున్నది. ఇది పురుమల్ల అంటే గిట్టనివారు చేస్తున్న ప్రచారమేనని, అందుకు అవకాశాలే లేవని పార్టీలో కొందరు చర్చించుకుంటున్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఇల్లందకుంటలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్

ఇల్లందకుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో అందించే సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఇల్లందకుంటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుక్రవారం సభకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు వారానికి రెండు రోజులు మహిళలకు ఉచితంగా రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తారన్నారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్థులకు నెలకు సరిపడా మం దులు ఇంటికి పంపించాలని పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. అనంతరం కలెక్టర్ గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్ జ్యోతి, తహసీల్దార్ రాణి పాల్గొన్నారు.

● భూ భారతితో సమస్యల పరిష్కారం

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇల్లందకుంట రైతు వేదికలో భూ భారతిపై రైతులకు అవగాహన సదస్సును కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు తహసీల్దార్ రాణి, ఎంపీడీవో పుల్లయ్య, ఏవో సత్యనారాయణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ కందాల కొంరెల్లి పాల్గొన్నారు.

● జమ్మికుంటలో..

జమ్మికుంట: భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో భూ భారతి చట్టం-2025పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ రైతులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్


కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరం లో పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరచాలని అధికా రులు, సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. నగరంలోని 5, 26, 27 డివి జన్లలో ఆమె శుక్రవారం పర్యటించారు. పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల బయోమెట్రిక్, హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి జవాన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులపై ఆరా తీశారు. నగర పాలక సంస్థ ద్వారా నిర్వహించే అన్నపూర్ణ 5 రూపాయల భోజనం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరపాలక సంస్థకు మంచి ర్యాంకు వచ్చేలా కార్మికులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. నగరాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటూ సెగ్రిగేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి చెత్తను వర్మి కంపోస్టు కేంద్రాలకు, పొడి చెత్త డబ్బాలు, అట్ట ముక్కలను డీఆర్‌సీసీకి తరలించేలా చూడాలన్నారు. కాలనీల్లో ఓపెన్ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించి డ్రైనేజీ పరిసర ప్రాంతాలను, చెత్త కలెక్షన్ పాయింట్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కార్మికులు సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ వేణుమాదవ్, జవాన్లు నరేందర్, సాయి పాల్గొన్నారు.

గూడు లేక.. గోడు చెప్పుకోలేక..

● బండరాతిపై దీనంగా..



● దిక్కుతోచక..రోడ్డుపై పరుగెత్తుతూ..



శాతవాహన యూనివర్సిటీలో గురువారం చెలరేగిన మంటలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. యూనివర్సిటీ ఆవరణలోని చెట్టూ చేమ అగ్నికి ఆహుతయ్యాయి. వన్యప్రాణులు చెల్లాచెదురయ్యాయి. వందల సంఖ్యలో ఉన్న నెమళ్లు రోడ్లపైకి వచ్చి భయంతో పరుగులు తీశాయి. గూడు చెదరడంతో ఓ మయూరం బండరాయిపై దీనంగా ఉన్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్

చొప్పదండి మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- పది వేల క్వింటాళ్లు.. మూడు కాంటాలు
- నత్తనడకన కొనుగోళ్లు



చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం నిల్వలు

చొప్పదండి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది. నాలుగు రోజులుగా రైతులు ధాన్యాన్ని భారీగా తీసుకువస్తుండడంతో మార్కెట్ మొత్తం నిండిపోయింది. స్థలం సరిపోక మార్కెట్ బయట రైతులు ధాన్యాన్ని పోసుకుంటున్నారు. స్థలం సరిపోవడం లేదని మార్కెట్ చైర్మన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా అధికారులతో మాట్లాడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలాన్ని కేటాయించారు.

● రోజుకు ఐదు వందల క్వింటాళ్లు మాత్రమే..

వ్యవసాయ మార్కెట్‌లో ఈ నెల 18న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్‌లో 10 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం నిల్వలు పేరుకుపోగా ప్రతిరోజు నాలుగు వందల నుంచి ఐదు వందల క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కాంటాలు అవుతున్నాయి. మూడు కాంటాలు మాత్రమే నడుస్తుండగా, రోజు మూడు లారీల ధాన్యం మాత్రమే తరలిస్తున్నారు. మరికొన్ని కాంటాలను ఏర్పాటు చేస్తే ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యే అవకాశం ఉంది. మార్కెట్‌లో ధాన్యం నిల్వలు పేరుకు పోతుండగా రైతులు ధాన్యాన్ని మార్కెట్ బయట పోసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ధాన్యాన్ని అమ్ముకోలేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకుని కాంటాలను పెంచాలని రైతులు కోరుతున్నారు. వాతావరణంలో మార్పులు వచ్చి రోజు సాయంత్రం ఆకాశం మేఘావృతం అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు కనీసం రెండు వేల నుంచి మూడు వేల క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు జరిగితేనే మార్కెట్‌లో సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

● షెడ్లు, గోదాంలలో వ్యాపారుల బస్తాలు

వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ షెడ్లు, గోదాంలలో వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసుకున్నారు. మార్కెట్‌లో స్థలం లేక రైతులు బయట ధాన్యాన్ని పోసుకుంటే వ్యాపారులు మాత్రం తమ ధాన్యాన్ని షెడ్లలోనుంచి తొలగించడం లేదు. గత నెలలో మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన మక్కలు అకాల వర్షానికి కొట్టుకుపోయాయి. ఈ సంఘటనపై పలు ఫిర్యాదులు రావడంతో అధికారులు వ్యాపారుల సరుకులను షెడ్ల నుంచి తొలగిస్తామని చెప్పారు. కాని ఇప్పటికీ తొలగించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ షెడ్లలో నిల్వ చేసిన వ్యాపారుల ధాన్యాన్ని ఖాళీ చేయించాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌ను బదనాం చేయడానికే ఆర్టీసీలో సమ్మె నోటీసు



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశంగౌడ్, నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడానికే ఆర్టీసీలో సమ్మె నోటీసు అందజేశారని ఐఎన్టీయూసీ డిప్యూటీ జనర్ సెక్రెటరీ జక్కుల మల్లేశంగౌడ్ విమర్శించారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో రిటైర్ అయిన నాయకులు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ప్రకటనలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. గతంలో ఆర్టీసీ సమ్మెతో 39 మంది కార్మికులు చనిపోయారన్నారు. సమ్మెతో ఆర్టీసీ కార్మికుల బతుకులు ఛిద్రమయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో చెప్పిన విధంగా ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తుందన్నారు. కార్మికులకు రావాల్సిన పెండింగ్ డిఎలు, 21 శాతం పీఆర్సీ, 2013 బాండ్ డబ్బులు అందించారన్నారు. ఒక్కో కార్మికుడికి లక్షకు పైగా డబ్బులు అందాయన్నారు. ఐఎన్టీయూసీకి చెందిన ఒక రిటైర్డ్ నాయకుడు సొంత నిర్ణయంతో 3న ధర్నా ఉంటుందని ప్రకటించాడని, అది అతడి వ్యక్తిగతమని, ఆ నిర్ణయంతో సంఘానికి ఎలాంటి సంబంధంబ లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు ఎన్‌కే రాజు, నగేష్, సంపత్, శ్రీధర్ పాల్గొన్నారు.

కేంద్రం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య

భగత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో కార్మిక సంఘాల జిల్లా సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయకుంటే బీజేపీని తరిమికొడతామన్నారు. లేబర్ కోడ్స్ ద్వారా కార్మికుల హక్కులకు భంగం కలుగుతుందన్నారు. మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చన్నయాదవ్, టేకుమల్ల సమ్మయ్య, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

● 250 గ్రాముల బంగారం, భారీగా నగదు స్వాధీనం

6

వెంటాడిన విధి..

● 21 రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి



ఎల్లవ్వ, నరేందర్, నర్సయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్న ఓ కుటుంబంపై విధి కన్నెర్ర జేసింది. అనారోగ్యం, ఆత్మహత్య రూపంలో 21రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలోని ముగ్గురిని కబళించింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ఈనెల 3న గడ్డి నర్సయ్య(55) అనారోగ్యంతో చనిపోయాడు. కుటుంబ పెద్ద మరణం నుంచి తేరుకోక ముందే నర్సయ్య కొడుకు నరేందర్(24) మండల కేంద్రంలో ఓ మహిళ తనపై తప్పుడు కేసు నమోదు చేయించి జైలుకు వెళ్లడానికి కారణమైందని మనస్తాపంతో ఈనెల 22 ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రీకొడుకులు చనిపోయిన బాధ నుంచి కోలుకోక ముందే నర్సయ్య తల్లి గడ్డిఎల్లవ్వ(80) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. ఐదుగురు నివసిస్తున్న ఇంటిలో ముగ్గురు చనిపోవడంతో నర్సయ్య భార్య లక్ష్మీ, పెద్ద కొడుకు నవీన్‌లు మిగిలారు. 21రోజుల వ్యవధిలో ముగ్గురు మృతిచెందడం స్థానికంగా విషాదం నింపింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రబోర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌కు చెందిన చెవుల రాజలింగయ్య(62) తన ద్విచక్రవాహనంపై ఊత్కూర్ చౌరస్తా నుంచి ఆంధ్రబోర్‌లోని తనకుమారుని వద్దకు వెళ్తుండగా వెనుకాల నుంచి ఓకారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని లక్షెటిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైనవైద్యంకోసం కరీంనగర్ తరలించగా అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నలుగురుపిల్లలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

యువతి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం... పెద్దపల్లి జిల్లా పాలితం గ్రామానికి చెందిన బాసిల్లి ఝాన్సీ(23) ఓప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా విధులు నిర్వర్తిస్తోంది. ఇద్దరు స్నేహితులతో కలిసి జ్యోతినగర్‌లో ఒక గదిలో ఉంటోంది. గురువారం రాత్రి భోజనం అనంతరం ఆమె గదిలోనే ఉండగా స్నేహితులు నిద్రించడానికి బిల్డింగ్‌పైకి వెళ్లారు. వారికి పరిచయం ఉన్న అజయ్ అనే వ్యక్తి వారికి ఫోన్ చేసి ఝాన్సీ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పడంతో కిందికి వచ్చి చూశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. ఝాన్సీ మృతిపై తమకు అనుమానాలున్నాయని మృతురాలి తండ్రి శంకర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అలంకారప్రాయంగా..

● వినియోగంలోకి రాని నూతన అంగన్‌వాడీ భవనాలు ● ఆటలకు దూరమవుతున్న చిన్నారులు





నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు, చిన్నారులకు అందుబాటులోకి రాని క్రీడా పరికరాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వసతులతో ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఒకే ప్రాంగణంలో అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను గత ప్రభుత్వం నిర్మించినా వినియోగంలోకి రాకుండా పోయాయి. ఫలితంగా చిన్నారులకు ఆటలు దూరమవుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాల భవనాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా గత సర్కారు ఆధునిక వసతులతో నిర్మించింది. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు విద్యను అందిస్తున్నా.. అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం స్థానిక పురాతన పాఠశాల గదుల్లోనే కొనసాగిస్తున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల కోసం ప్రత్యేక వసతులు కల్పించిన ప్రయోజనం లేకుండాపోతోంది. అంగన్‌వాడీ కేంద్రం-2, 3లోని పిల్లలు అరకొర సౌకర్యాల నడుమ అవస్థలు పడుతున్నారు. విశాలమైన భవనాలు, ఆట వస్తువులు ఉన్న నూతన భవనాల్లోకి అంగన్‌వాడీ కేంద్రాలను తరలించడం లో సంబంధిత శాఖ అధికారులు అభ్యంతరమేమిటని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నూతన భవనాల్లోకి తరలించి ఆటపాటలతో కూడిన విద్య అందేలా చూడాలని కోరుతున్నారు.

నూతన భవనాల్లోకి కేంద్రాలను తరలించేలా చర్యలు..

లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల ప్రాంగణంలో ఉన్న నూతన భవనాల్లోకి తరలించేలా చర్యలు చేపడుతున్నాం. చిన్నారులు, తల్లులకు ఆధునిక వసతులు, ఆటలు అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. గతంలో పాఠశాల ప్రాంగణంలోకి కేంద్రాలను తరలిస్తే తల్లులు, గర్భిణులు భోజనం చేసేందుకు దూరమవుతుందనే కారణంతో పురాతన పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశాం. అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు, స్థానికులతో చర్చించి కేంద్రాలను నూతన భవనాల్లోకి మార్చుతాం.

తూకంలో జాప్యం.. రైతుల పడిగాపులు



ప్రభుత్వ కేంద్రంలో కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో జాప్యం వల్ల రైతులు పడిగాపులు కాస్తున్నారు. తూకంలో ఆలస్యం.. మేఘాలు కమ్ముకుంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు. ఇదేఅదనుగా భావించి ప్రైవేటువ్యాపారులు కేంద్రాల్లో వాలుతున్నారు. క్వింటాలుకు రూ.1750 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ప్రైవేటుపరం అవుతున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేసి ప్రభుత్వ మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్ఎంపీ ఆత్మహత్య

మేడిపల్లి, ఏప్రిల్ 25: అనారోగ్యం కారణంగా ఓ ఆర్ఎంపీ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లికిచెందిన ఆర్ఎంపీ సంబారు జగదీష్ బాబు(44) మూడు సంవత్సరాల నుంచి తీవ్రమైన మెడనొప్పితో బాధపడుతున్నాడు. నాలుగునెలల క్రితం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. కానీ మెడనొప్పి తగ్గలేదు ఆపరేషన్ కోసం రూ.5లక్షల వరకు ఖర్చు అయింది. అనారోగ్యంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య రూపాశ్రీ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ మధుకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గొర్రెల దొంగతనానికి యత్నం

హుజూరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని దమ్మక్కపేటలో గురువారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరువ్యక్తులు గొర్రెల దొంగతనానికి ప్రయత్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు మేతకోసం దమ్మక్కపేటకు వచ్చి మందను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి గొర్రెలు అరవడంతో కాపరులు లేచి చూడగా ఇద్దరు వ్యక్తులు గొర్రెల వద్ద కనిపించారు. వారిలో ఒకరిని పట్టుకోగా, మరో వ్యక్తి పరారయ్యాడు. అతడిని హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గొర్రెల కాపరి యజమాని బీరప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. నెల రోజులుగా 40 గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బీరప్ప వాపోయాడు.

అంగన్‌వాడీ టీచర్‌పై తేనెటీగల దాడి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్‌పై తేనెటీగలు దాడిచేశాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల సరోజన అనే అంగన్‌వాడీ టీచర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా వచ్చి దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన సరోజనను స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు..

తంగళ్లపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో విద్యుత్‌స్తంభానికి కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న కారు సారంపల్లి గ్రామశివారులో మూల మలుపు వద్ద విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న సాగర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. కాగా, విద్యుత్ స్తంభం విరిగి కింద పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. కారు యజమాని సెస్‌కు నష్టపరిహారం కింద రూ.10వేలు చెల్లించాడు. రెండు గంటల తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

● 250 గ్రాముల బంగారు ఆభరణాలు, భారీగా నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలో చోరీకి పాల్పడిన కేసుల్లో చిగురుమామిడి మండలం నవాబ్‌పేటకు చెందిన కంది సంపత్‌రెడ్డి, వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన సూర రవిని అరెస్టు చేసినట్లు, వారి వద్ద 250 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. శుక్రవారం కరీనంరగ్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నవాబ్ పేటకు చెందిన సంపత్‌రెడ్డి కరీంనగర్ బస్టాం డ్‌లో ఫిబ్రవరి 14న మహిళ బ్యాగ్ నుంచి 16.5 తులాల బంగారం, ఫిబ్రవరి 24న మరో మహిళా బ్యాగ్ నుంచి 47 గ్రాముల బంగారం, ఏప్రిల్ 8న ఓ వృద్ధుడి బ్యాగ్‌లో నుంచి 13 లక్షల నగదు చోరీచేశాడు. నిందితుడు శుక్ర వారం కమాన్‌చౌరస్తా వద్ద అనుమానా స్పదంగా కనిపించగా ఒకటో ఠాణా సీఐ కోటేశ్వర్ అదుపులోకి తీసుకొని విచారించారు. బస్టాండ్‌లో చోరీలకు పాల్పడు తున్నట్లు వెల్లడైంది. నర్సంపేటకు చెందిన సూర రవి ఏప్రిల్ 13న సప్తగిరి కాలనీలోని ఒక ఇంటిలో చొరబడి 175 గ్రాముల బంగారం, రూ.35వేల నగదును ఎత్తుకెళ్లాడు. పద్మనగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు.

అతడివద్ద నుంచి 100గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బంగారం, నగదును సీజ్ చేసినట్లు, ఇద్దరిని కోర్టులో హాజరుపర్చను న్నట్లు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకొని సొత్తును రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన టౌన్ ఏసీపీ వెంకటస్వామితోపాటు సీఐలు బిల్ల కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బందిని అభినందించారు.

ఎస్‌యూ స్టోర్‌రూంలో అగ్ని ప్రమాదం



స్టోర్ రూం సమీపంలో కాలిపోయిన చెట్లు



దగ్ధమవుతున్న పేపర్లు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం స్టోర్ రూంలో శుక్రవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవిం చింది. ప్రమాదంలో ఎస్‌యూకు చెందిన దిద్దిన పరీక్షపేపర్లు దగ్ధమ య్యాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ఆన్సర్ పేపర్లు ఈ మంటల్లో దగ్ధమైనట్లు జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదంపై కొత్తపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. గురువారం ఉదయం నుంచిరాత్రి వరకు ఫైర్ సిబ్బంది 4ఫైరింజన్‌లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వారు వెళ్లిన అనంతరం వేకువజామున మళ్లీ మంట లు చెలరేగడంతో అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.

బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఎండీ అంకుస్(78) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంత కాలంగా అంకుస్ మానస్థితి సరిగలేదు. శుక్రవారం ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న వ్యవసాయ బావిలోపడి నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కూమారుడు ఎండీ ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరి మృతి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి సమీపంలో నివాసం ఉంటున్న గొల్లపెల్లి జగన్ గౌడ్(38) అనే యువకుడు వడదెబ్బతో మృతిచెందాడు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తట్టుకోలేక వడదెబ్బ తగిలి మృతిచెందాడు. మృతునికి భార్య జల, ఇద్దరు చిన్నారులు నిక్షిత, నిత్యశ్రీ ఉన్నారు. జగన్‌గౌడ్ మృతితో కుటుంబీకులు తీవ్రంగా విలపిస్తున్నారు.



వెంకన్న (ఫైల్)

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలానికి చెందిన వొల్లాల వెంకన్న(55) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. వెంకన్న జీప్ నడిపిస్తుంటాడు. గతంలో పక్షవాతం రావడంతో ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవలే ఆరోగ్యం కుదుటపడింది. మధ్యాహ్నం భోజనం చేసి బయటకు కాలినడకన వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందాడు. ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంజాల సమ్మయ్య తనను వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కథనం ప్రకారం.. వివాహిత పిల్లలతో ఒంటరిగా ఇంటిలో ఉండగా సమ్మయ్య ఇంటికి వెళ్లి తన కోరిక తీర్చాలని వేధింపులకు గురిచేశాడన్నారు. ఈ మేరకు సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

● కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం..



సద్దాలలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి కవర్లు కప్పుతూ ఇబ్బందులు పడుతున్న రైతులు

కోనరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండ డంతో.. అన్నదాత్లో గుబులు రేగుతోంది.. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మూలుగుతుండ డంతో కుప్పలను కాపాడుకోవ డానికి రైతులు పాట్లు పడుతు న్నారు. కోనరావుపేట మండలం లో శుక్రవారం సాయంత్రం మబ్బులు కమ్ముకోవడంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో మబ్బులు కమ్ము కొని ఈదురుగాలులు రావడంతో వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతులు నానా ఇబ్బందిపడ్డారు. ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా కవర్లు లేకపోవడంతో ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అప్పుల బాధ భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

మంథనిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఆకుల రాజేష్(32) అనే యువకుడు శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంథని పోలీసుల కథ నం ప్రకారం.. గుంజపడుగు గ్రామానికి చెందిన రాజేష్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని కుమారుడికి అరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స కోసం అప్పులుచేశాడు. అప్పులుతీర్చే దారిలేకపోవడంతో గురు వారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమ నించిన కుటుంబసభ్యులు చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య అకుల లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడిన దంపతులపై కేసు

చందుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూమి హద్దురాళ్ల తొల గింపు విషయంలో ఓ వ్యక్తిని చంపుతామని బెదిరించిన ఘటనలో దంపతులపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై అంజయ్య శుక్రవారం తెలిపారు. ఎస్సైకథనం ప్రకారం.. కొనరావుపేట మండ లం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాటిపెల్లి రాజిరెడ్డికి చందుర్తి మండలం ఎనగల్ గ్రామశివారులోని సర్వే నంబర్ 427లో 10 గుంటల భూమి ఉంది. కొంత భూమి చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికిచెందిన గుండెకర్ల తిరుపతికి సంబం ధించిన భూమిలో అదనంగా ఉన్నట్లు సర్వేయర్ గుర్తించారు. సర్వేయర్ నిర్ణయించిన భూమికి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. తిరుపతి హద్దురాలను తొలగించడంతో ఇద్దరి మధ్య గొడవ తలెత్తింది. హద్దురాళ్లను తొల గించి చంపేస్తామని బెదిరింపులకు పాల్పడిన ఎన్గల్ గ్రామానికి చెందిన గుండెకర్ల తిరుపతి-విజయ దంపతులపై రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి

● గంగాధర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీచేసిన సీపీ గౌస్ ఆలం



కేసుల రికార్డులను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

గంగాధర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేకనిఘా ఉంచి వారికదలికలను గమనిస్తుండాలని సీపీ గౌస్‌ఆలం అన్నారు. శుక్రవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షనిర్వహించారు. కేసులు పెండింగ్‌కుగల కారణాలను అడిగి తెలుసుకుని వాటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని, సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజలతో మమేకం కావాలని ఆదేశించారు.ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామానికి ఒక ప్రత్యేక పోలీస్‌సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. గంజాయి రవాణా, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్‌బియ్యం రవాణా, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈసందర్భంగా స్టేషన్ సిబ్బందితో ఆయన ముచ్చటించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో ఎస్ఐ వంశీకృష్ణ, ఇతర సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

రేఖది హత్యే: సీఐ శ్రీనివాస్‌గౌడ్

గంభీరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గజసింగవరంలో చెరుకూరి రేఖది అనుమానాస్పద మరణం కాదని, హత్యేనని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అత్యాచారయత్నంలో శ్రీకాంత్ రేఖను హత్య చేశాడని సీఐ వెల్లడించారు. గజసింగవరం ఘటనపై సీఐ శ్రీనివాస్‌ను వివరణఅడగా, రేఖది హత్యేనని తెలిపారు. రేఖను హత్య చేసిన అనంతరం భయంతో శ్రీకాంత్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తన భార్యను శ్రీకాంత్ అనే వ్యక్తి హత్య చేశాడంటూ మృతురాలి భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు చేశాడని సీఐ వెల్లడించారు.

మత విభజనలు దేశానికి ప్రమాదకరం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్‌వీరయ్య

భగత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మత విభజనలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్‌వీరయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగ్రవాదాన్ని ఐక్యంగా అంతమొందించాలన్నారు.పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత అమానుష, హేయమైన చర్య అని, దేశ ప్రజలు ఒక్కటిగా ఎదుర్కొని టెర్రరిజాన్ని తుదముట్టించాలన్నారు. ఘటనపై లోతైన దర్యాప్తు జరపాలన్నారు.

కాశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైందని ప్రధాని, హోంమంత్రి ప్రకటించారన్నారు. పెద్ద నోట్ల రద్దు సందర్భంగా కూడా నకిలీ నోట్లు టెర్రరిస్టులకు అందుబాటులో లేకుండా చేయాలనే నోట్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రకటనలకు ఆచరణలకు పూర్తి విరుద్ధంగా కాశ్మీర్‌లో పరిస్థితులు ఉన్నాయన్నారు. దేశంలోని 143 భారత పౌరులను ఐక్యంగా నిలబెట్టాల్సిన తరుణంలో మతపరమైన సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఉగ్రవాదుల నుండి తుపాకి లాక్కునే ప్రయత్నంలో హార్స్ రైడర్‌ను కాల్చి చంపారని, ఆ యువకుడు ఒక ముస్లిం అని మర్చి పోకూడదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 500 బోనస్ చెల్లించాలన్నారు.

కిషన్ రెడ్డి బొగ్గు శాఖ మంత్రి ఉండగానే సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేశారన్నారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి తేడా లేదన్నారు. సింగరేణిని కాపాడుకునే సోయి ఈ మూడు పార్టీలకు లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమా సాహేబ్, యు శ్రీనివాస్, డినరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వీరయ్య, పాల్గొన్న సీపీఎం నాయకులు

తునికాకు సేకరణపై సన్నగిల్లుతున్న ఆసక్తి



- కూలీలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు
- ఆకు, కూలీలు లేక టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- జిల్లాలో అమ్ముడుపోని తునికాకు యూనిట్లు
- 7 యూనిట్లకు 3 యూనిట్లలోనే టెండర్లు పూర్తి
- 28 కళ్లాల్లో ఆకుల సేకరణ బంద్, జిల్లా లక్ష్యం 7600 ఎస్‌బీలు
- మే తొలి వారంలో ఆకు సేకరణ, గతేడాది 50 ఆకుల కట్టకు రూ. 3

మంథని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లోని గ్రామీణ కూలీలకు వేసవిలో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న తునికాకు సేకరణపై ఆసక్తి సన్నగిల్లుతోంది. పదేళ్ళ క్రితం వరకు యేటా తునికాకు సీజన్‌లో వచ్చే ఆదాయంతో కుటుం బంలో ముఖ్యమైన కార్యక్రమాలను గట్టెక్కించునే వారు. రాను రాను గ్రామీణులు ఆకు సేకరణకు ముందుకు రావడం లేదు. యేటా అడవులు, గుట్టలు అంతరించిపోవడం, ఆకు లభ్యం కాకపోవడం, ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు స్థానికంగా అందుబాటులోకి రావడంతో పల్లె జనం తునికాకు సేకరణపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాలకు తోడు నాణ్యమైన తునికాకు లభ్యం కాకపోవడంతో యూనిట్ల కోసం టెండర్లు వేసే కాంట్రాక్టర్లు సైతం ముందుకు రావడం లేదు. గతంలో తునికా కు యూనిట్ల కోసం కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్లు దక్కించు కునే వారు. ప్రస్తుతం పరిస్థితి క్రమంగా తగ్గుతూ వస్తుంది.

మంథని, పెద్దపల్లి ఫారెస్టు రేంజి పరిధిలో మంథని-1, ఖమ్మంపల్లి, ముత్తారం-ఏ, ముత్తారం-బీ, రామగుండం, పెద్దపల్లి, కల్వచర్ల యూనిట్లు ఉండగా వాటిలో తునికాకు సేకరణ కోసం ప్రభుత్వం ద్వారా ఆటవీ శాఖ టెండర్లు ఆహ్వానించగా ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, కల్వచర్ల కేవలం మూడు యూనిట్లనే కాంట్రాక్టర్లు తీసుకున్నారు. మిగితా 4 యూనిట్లలో ఆకు సేకరణకు కాంట్రాక్టర్లు టెండర్లు తీసుకులేదు.

జిల్లాలోని 7 యూనిట్లలో 47 ఆకుల కళ్ళాలు, 7600 స్టాండర్ బ్యాగ్‌ల టార్గెట్ ఉండగా వాటిలో ఈ సంవత్సరం 3 యూనిట్లలో మాత్రమే టెండర్ ప్రక్రియ ముగియడంతో వాటి పరిధిలోని 18 కళ్లాల్లో ఆకు సేకరణ జరగనుంది. మిగితా 29 కళ్ళాలల్లో ఈఏడు ఆకు సేకరణ జరగడం లేదు. ముత్తారం యూనిల్ పరిధిలోని దర్యాపూర్, హరిపురం, కేశనపల్లి, మచ్చుపేట, మైదంబండ, పారుపల్లి గ్రామాల్లో 900 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా ఆకుల కళ్ళాలు ఏర్పాటు చేయనున్నారు. ఖమ్మంపల్లి యూనిట్ పరిధిలోని చిన్నఓదాల, ధర్మారం, గోపాల్‌పూర్, జీల్లల్లపల్లి-ఏ, జిల్లల్లపల్లి-బీ, ఖమ్మంపల్లి-ఏ, ఖమ్మంపల్లి-బీ, సీతంపల్లి గ్రామాల్లో 1700 స్టాండర్ బ్యాగుల లక్ష్యం. కల్వచర్ల యూనిట్ పరిధిలోని గౌరెడ్డిపల్లి, రత్నాపూర్, సబితం, వెన్నంపల్లి గ్రామాల్లో 200 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా కళ్ళాలు ఏర్పాటు చేయనున్నారు. 50 ఆకుల కట్టకు రూ. 3 గత ఏడాది కాంట్రాక్టర్లు కూలీలకు చెల్లించారు. ఈఏడాది ఇంకా కట్ట రేట్ నిర్ణయించలేదు. వెయ్యి ఆకు కట్టలు ఒక స్టాండర్ బ్యాగ్‌గా లెక్కిస్తారు. మే తొలి వారంలో టెండర్లు పూర్తయిన ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, కల్వచర్ల యూనిట్ల పరిధిలోని 18 కళ్లాల్లో తునికాకు సేకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. యూనిట్ల పరిధిలోని ఆయా అటవీ గ్రామాల్లో వారం లేదా 10 రోజుల పాటు తునికాకు సీజన్ సందడి కొనసాగనుంది.

కాలిబూడిదైన ఈతవనం

మూడు వేలకుపైగా చెట్లు దగ్ధం



బండలింగాపూర్ శివారులో కాలిపోయిన ఈత చెట్లు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండ లింగాపూర్ గ్రామ శివారులోని శుక్రవారం ఈతవనం దగ్ధమైంది. గ్రామ శివారులో గీత కార్మికులు మూడు ఎకరాలలో ఈత చెట్లను పెంచుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉండవచ్చునని స్థానికులు పేర్కొంటున్నారు. అగ్నిప్రమాదం తెలిసిన వెంటనే గీత కార్మికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈతచెట్లు కాలి బూడిదయ్యాయని గౌడ కులస్తులు పేర్కొన్నారు. ఈత వనం దగ్ధం కావడంతో ఉపాధి కరువవుతుందని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంబయ్యపల్లి శివారులోని గర్రెపల్లి చెరువులో గుర్తుతెలియని మహిళ(45) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ మృతదేహం కుళ్లినస్థితిలో ఉంది. జీన్స్ ప్యాంట్, మూడు షర్టులు వేసుకొని ఉంది. ఆమె ప్యాంట్ జేబులో మధ్యప్రదేశ్‌కు చెందిన లేఖన్‌సింగ్ పేరుతో ఉన్న పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన డెబిట్‌కార్డు లభ్యమైంది. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా ఎస్‌ఐ సెల్ నంబర్ 8712656511కు సమాచారం అందించాలని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ సూచించారు.

సీజేరియన్లు తగ్గించి..

సహజ ప్రసవాలను ప్రోత్సహించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీజేరియన్లు తగ్గించి.. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, , జమ్మికుంట జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవుట్‌రీచ్ కేంద్రాల్లో ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులు నిర్వహించి మహిళలందరికీ స్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధు, జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్, జమ్మికుంటలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేష్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఇల్లందకుంట పీహెచ్‌సీలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో కూలర్లు, డ్రమ్ములు, పాతటైర్లు, తదితర వాటిలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్‌లో వేసవి కాలానికి సంబంధించి మందుల నిల్వలను, లేబరేటరీ, ఎన్‌సీడీ క్లీనిక్‌లను సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, డాక్టర్ కల్యాణ్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





హుజూరాబాద్‌లో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, ఇల్లందకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి



దత్తత తీసుకున్న దంపతులకు ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహంలో పెరుగుతున్న ఆరునెలల శిశువును పూణేకు చెందిన దంపతులు రెండు నెలల క్రితం దత్తత ఇచ్చారు. ఆ దంపతుకు దత్తత ఉత్తర్వులను కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకోవాలన్నుకవారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేష్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన



ఎస్‌యూలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్, పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వద్ద చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వారందరూ కొన్ని దశాబ్దాలుగా యూనివర్సిటీ విద్యా వ్యవస్థను తమ బోధనతో కాపాడుకుంటూ వచ్చిన వాళ్లేనని, వారి సేవలను గుర్తించాలని కోరారు.

శాతవాహనలో ఎంఫార్మసీ పరీక్ష వాయిదా

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నె 28 నిర్వహించనున్న ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్ష వాయిదా వేసినట్లు విశ్వ విద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. అదే రోజున ఆర్ఆర్‌బీ పరీక్ష ఉందని, ఎం ఫార్మసీ పరీక్షను 29కి వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించే సభకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండలంలోని సింగాపూర్, చిన్న పాపయ్యపల్లి, కందుగుల గ్రామాల్లోని చెట్లకు పార్టీ రంగులువేసి పర్యావరణానికి హాని కలిగించారని దీనిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం యువజన కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యక్ర మానికి చెట్లను వాడుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చెట్లకు వేసిన పార్టీ వేసి రంగులపై తెలుపురంగు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఉమ్మడి సందీప్, పంజాల అరవింద్, సుమన్ తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ కృషి

ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా

జ్యోతినగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ రాజీలేని పోరాటం చేస్తున్నదని యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బాబర్ సలీంపాషా తెలిపారు. శుక్రవారం ఎన్టీపీసీ పీటీ ఎస్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబర్ మాట్లాడారు.



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు పొందిన ఐఎన్‌టీయూసీ సంఘ టిత, అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తున్నదన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. నూతన కార్యవర్గం జిల్లాలో అన్నివర్గాల కార్మికుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తుందన్నారు. ప్రధానంగా ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్‌తోపాటు అసంఘటిత రంగంలోని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, బీడీ కార్మికులు తదితర కార్మికుల కోసం పనిచేస్తుందన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెకు జిల్లా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో అన్ని యూనియన్లతో సమన్వయం చేసుకొని సమ్మె విజయవంతానికి కృషి చేస్తామని బాబర్ తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బూమళ్ల చందర్, ప్రధాన కార్యదర్శి విజయ్ మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ పెద్దపల్లి జిల్లా కమిటీ..

ఐఎన్‌టీయూసీ పెద్దపల్లి జిల్లా కార్యవర్గాన్ని యూనియన్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూమళ్ల చందర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ మోహన్, ఉపాధ్యక్షులుగా నీరటి శంకర్, మేకల సతీష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా కుల్ల వెంకటేశ్వర్లు, కనకయ్య, జునుతుల సమ్మిరెడ్డి, కొమరయ్య, కోశాధికారిగా సురేందర్, జాయింట్ సెక్రెటరీలుగా నయీం పాషా, బొద్దున శీనివాస్, ఎండీ జమీల్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బడి భద్రత ఎలా?

- పాఠశాలలకు ప్రారంభమైన వేసవి సెలవులు
- ప్రభుత్వ పాఠశాలల్లో విలువైన సామగ్రి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలలకు రాత్రి పూట కాపాలాదారుల లేక రక్షణ కరువైంది. వేసవిసెలవులు ప్రారంభమయ్యాయి. దీంతో విలువైన కంప్యూటర్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, టీవీలు, బెంచీలు, ల్యాబ్ పరికరాలు ఇతర సామగ్రి భద్రత అధికారులకు ప్రశ్నార్థకంగా మారింది. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఇలాంటి చోట్ల చోరీలు జరగడానికి ఎక్కువగా అవకాశం ఉంది. ఏ పాఠశాల లోనూ సీసీ కెమెరాలు లేవు. కిటికీలు, తలుపులు కూడా సరిగ్గా లేకపోవడం సమస్యగా మారింది. పలు చోట్ల ప్రభుత్వ పాఠ శాలల్లో అసాంఘిక కార్యకలా పాలు చోటు చేసుకుం టున్నాయి. విద్యా ర్థులు టెక్నికల్‌స్కిల్స్ పెంపొందించడానికి కొన్ని సంస్థలు ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు, విలువైన తరగతి సామగ్రిని అందజేశారు. వాటి భద్రత ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది.



బెల్లూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కాపాలాదారులను నియమించాలి..

వేసవి సెలవులు ముగిసే వరకు తాత్కాలిక పద్ధతిలోనైనా ఉన్నతపాఠశాలలకు కాపలాదారులను నియమించాలి. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు కూడా కొంత బాధ్యత అప్పగిస్తే మేలు. కంప్యూటర్లు ఉంచిన గదులకు తలుపులు, కిటికీలు పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి. పాఠశాల ఆవరణల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

అందరూ కలిసి కాపాడుకోవాలి.. భూపతి శ్రీనివాస్, ఎంఈవో, హుజూరాబాద్



ఉన్నతపాఠశాల్లో కంప్యూటర్లు ఉన్నాయి. భద్రత ఉన్న గదుల్లోనే కంప్యూటర్లు ఉన్నాయి. గ్రామాల్లో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు వేసవి సెలవుల్లో పాఠ శాలలపై ఓ కన్నేసి ఉంచాలి. పాఠశాలల ఆస్తులను అందరూ కలిసి కాపాడుకోవాలి.

అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలకు ప్రభుత్వం ఆదేశం

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఉన్న సమయంలో.. 11 ఏళ్ల క్రితం జరిగిన ఓ అవినీతి వ్యవహారంలో బాధ్యులైన అధికారుల నుంచి డబ్బులు రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 11 ఏళ్ల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగింది. దీనిపై విచారణ జరిపిన ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పదవీ విరమణ పొందిన అధికారులు మోహన్‌రెడ్డి నుంచి 45 లక్షలు, రాములు నుంచి 11 లక్షలు, రాధమ్మ, సుభద్ర, విజయలక్ష్మి పెన్షన్ నుంచి రెండు శాతం రివకవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సీనియర్ అసిస్టెంట్ జయకృష్ణ నుంచి 24 లక్షలు రికవరీ చేసి అతడిని రివర్షన్ చేసింది. ఏడీ సరస్వతి, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, ధర్మయ్యను మళ్లీ తప్పులు చేయవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమయ్య మాట్లాడుతూ ఐడీసీఎస్‌లో అవినీతికి పాల్పడ్డ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి



సైనీశ్రీ (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన కోమలత-సంతోష్ దంపతుల కుమార్తె సైనీశ్రీ(8) శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెంది. వివరాల్లోకి వెళితే.. సంతోష్ కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారి పక్కన నూతన ఇంటిని నిర్మించాడు. దాని పక్కన సిమెంట్ ఇటుకలతో వాటర్ ట్యాంకును నిర్మించారు. బంధువుల ఇంటిలో ఫంక్షన్ ఉండగా తన చిన్న కుమార్తె వెళ్లగా గురువారం పెద్ద కుమార్తె సైనీశ్రీని తల్లిదండ్రులు కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకులో నీటిని నింపేందుకు తీసుకెళ్లారు. ట్యాంకు పక్కన సైనీశ్రీ ఆడుకుంటున్న సమయంలో ట్యాంకు కూలిపోయి చిన్నారి మీద పడి తీవ్రగాయాల పాలైంది. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందింది. మృతురాలు రెండో తరగతి చదువుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

హిందువులే లక్ష్యంగా ఉగ్రదాడులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హిందువులను లక్ష్యంగా చేసుకొని పహల్గాంలో ఉగ్రదాడులు చేశారని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అధిముళ్ల విద్య సాగర్, భజరంగ్ దళ్ జోనల్ కన్వీనర్ తోట ప్రదీప్ అన్నారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటకులను మతం అడిగి చంపడం దారుణమన్నారు. అనంతరం ఉగ్రవాదుల ఫ్లెక్సీని దహనం చేశారు. పరిషత్ ఉపాధ్యక్షులు రుద్రోజు సరుపా రని, భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ కన్నం శంకర్, జిల్లా సహ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

భగత్‌నగర్: కొత్తపల్లి మండలం మల్కాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు నివాళులు అర్పించారు. రైతు సేవా సమితి అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, పండుగ సాయికృష్ణ, లక్ష్మీరాజం పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: మాల జేఏసీ ఆధ్వర్యంలో నివాళుల ర్పించారు. జేఏసీ చైర్మన్ బొగ్గుల మల్లేశం, మేడి అంజయ్య, కాడ శంకర్ పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్: యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొయ్యడ వేణు ఆధ్వర్యంలో నగరంలోని మారుతీ నగర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దొంతి గోపి, కరీంనగర్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కృపాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ రజక ఆధ్వర్యంలో శుక్రవారం చాకలి ఐలమ్మ చౌక్ నుంచి తెలంగాణ చౌక్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.

కరీంనగర్ రూరల్, తీగలగుట్టపల్లిలో కోదండ రామాలయ కమిటీ, ఉపాధ్యాయ సేవా సమితి, నిఫా, హిందూ సంఘాలు, మాజీకార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● న్యూస్‌బాక్స్

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్ఖానగడ్డ ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంద్ర రవీందర్(50) గురువారం వడ దెబ్బకు గురై మరణించాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో కోరారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు దుర్శేడ్‌లో భూభారతిపై అవగాహన

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో శనివారం భూ భారతి- కొత్త ఆర్వోఆర్ చట్టం (2025)పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రూరల్ తహసీల్దార్ రాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దుర్శేడ్ రైతు వేదికలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్రదాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ కో- ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా యూనిట్ అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. శుక్రవారం నగరంలోని బ్యాంకు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధాన కార్యదర్శి రాజు, డీజీఎం బ్రహ్మానందరావు, ఏజీఎంలు తదితరులు

వైద్య శిబిరం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికవర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోతిరాంపూర్‌లోని మహేంద్ర షోరూంలో నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, 2డి ఇకో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ లోకేష్ బీరకాయల మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, వ్యసనాలతో కలిగే అనర్థాలపై వివరించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశపరీక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్ తెలిపారు. 2025-26లో ప్రవేశం పొందడానికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లు పొందడానికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

శిలువ పునరుత్థాన జాతర

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని క్రిస్టియన్ కాలనీలోని సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం శిలువ పునరుత్థాన జాతర మహోత్సవం నిర్వహించారు. బిషప్ డాక్టర్ రూబెన్‌మార్క్, చర్చ్ పాస్టరేట్ కమిటీ చైర్మన్ ఎస్.జాన్, సెక్రెటరీ నారాయణ, ట్రెజరర్ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవులు దక్కేదెవరికి?

(5వ పేజీ తరువాయి)

తెలుసుకున్న తర్వాత సూచించే పేర్లలోనుంచి ఒకరిని జిల్లా అధ్యక్ష పదవికి ఎంపిక చేసే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు అందులో ఎవరివైపు మొగ్గు చూపుతారో అన్నది ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

● **నేతలతో పరిశీలకుల సమావేశాలు**

పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం పేర్కొనడం పార్టీ శ్రేణుల్లో సంతోషాన్ని నింపింది. ప్రధానంగా పదేళ్లకుగా పార్టీ కోసం సేవలందించినవారికే అవకాశమిస్తామనడాన్ని వారు స్వాగతిస్తున్నారు. జిల్లా పరిశీలకులుగా నియమితులైనవారు ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఆయా జిల్లాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహిస్తారు. అధిష్ఠానం ఇచ్చిన ఫార్మట్లలో జిల్లా అధ్యక్ష పదవి కోసం ఐదుగురి పేర్లను, బ్లాక్ అధ్యక్ష పదవి కోసం ముగ్గురి పేర్లను, మండల అధ్యక్ష పదవి కోసం ఐదుగురి పేర్లను ప్రతిపాదించాల్సి ఉంటుంది. గ్రామ స్థాయి అధ్యక్షుల కోసం వీరు మూడు పేర్లను ప్రతిపాదిస్తారు. పీసీసీకి ఈ ప్రతిపాదనలు సమర్పించిన తర్వాత రాష్ట్రస్థాయిలో కీలక నేతలతో చర్చించి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధిష్ఠానానికి షార్ట్ లిస్టును ప్రతిపాదిస్తారు. పదవుల నియామకాన్ని అధిష్ఠానం ఖరారు చేస్తుంది.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు, ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ నెల 28 నుంచి కరీంనగర్‌లోని నాలుగు ప్రభుత్వ పాఠశాలలతోపాటు ఎంపిక చేసిన 10 ప్రైవేట్ పాఠశాలల్లో 20 అంశాలపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లోని బాలభవన్, అంబేద్కర్ స్టేడియం, సప్తగిరికాలనీలోని కేజీబీవీ స్కూల్, మంకమ్మతోటలోని గర్ల్స్ హైస్కూల్‌తోపాటు ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు జరుగుతాయని తెలిపారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఈవో జనార్దన్‌రావు, క్వాలిటీ కో-ఆర్డినేటర్ కర్ర అశోక్ రెడ్డి, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు శేఖర్‌రావు, రామారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో వార్షికోత్సవం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మంకమ్మతోటలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవాన్ని శుక్రవారం రేకుర్తిలోని శుభం గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడారు. 28 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టు కున్నాయి. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్‌లు డా.ఎల్.శ్రీనివాస్, డా.వి.స్వర్ణలత వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాలి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగర పరిధిలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాలని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. శిబిరాలతో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసుకునే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఏటా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్థానిక అంబేద్కర్ స్టేడియంలో స్మార్ట్ సిటీ కింద కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి క్రీడా మైదానాలు రూపొందించినా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. గతేడాది వేసవి శిబిరాల కోచ్‌లకు గౌరవ వేతనం అందించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై ఆరోపణలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తప్పుల తడక సర్వేతో అర్హులకు అన్యాయం జరుగుతోందని బాధితులు వాపోతున్నారు. కరీంనగర్ మండలం నల్లగుంట పల్లెకు చెందిన విలాసాగరం స్వరూప భర్త మరణించడంతో కూలీ చేసుకుంటూ వికలాంగుడైన కుమారుడు సంపత్‌ను పోషించుకుంటోంది. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంది. స్వరూప కుటుంబానికి ఫోర్ వీలర్ ఉందంటూ ఇల్లు మంజూరు చేసేందుకు నిరాకరించారు. తమకు ఫోర్‌వీలర్ లేదని, దివ్యాంగుడైన కుమారుడు ఉపయోగించే ద్విచక్ర వాహనమేనని విన్నవించినా పట్టించుకోలేదని స్వరూప ఆవేదన వ్యక్తం చేస్తోంది. పేదల పేర్లు జాబితాలో గల్లంతు అవుతున్నాయని, తప్పుడు సమాచారంతో దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ ర్యాలీ ప్రారంభించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఉమాశ్రీ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంహెచ్ ఎన్‌వీవో డాక్టర్ సనజవేరియా, మాస్ మీడియా అధికారి రాజగోపాల్ పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న అడిషినల్ డీఎంహెచ్‌వో సుధ

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ మాలతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

హుజూరాబాద్ రూరల్/జమ్మికుంట రూరల్: మండలంలోని చెల్పూర్, జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల పరిధిలో మలేరియాపై పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మధు అవగాహనకల్పించారు.

రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ వార్డు ఆఫీసర్లను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్త కార్డులు, నూతన పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారిని వెరిఫికేషన్ చేయాలని కోరారు. దరఖాస్తుల ఆధారంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి అర్హులు, అనర్హులను గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిం చిన ప్రకారం కుటుంబ స్థితిగతులను పరి గణలోకి తీసుకొని, సరైన వివరాలను నమోదు చేసి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అంతేకాకుండా 5 శాతం రిబేట్ స్కీంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారం రోజుల్లో 5శాతం రిబేట్ గడువు ముగు స్తున్నందున ఆస్తి పన్నులు వసూలు చేయాలన్నారు. 25 శాతం టార్గెట్ ను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ట్రినిటి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజనీరింగ్‌కళాశాల విద్యార్థులకు వల్లీ ఎంటర్‌ప్రైజెస్ వారు శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 32 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ రెడ్డి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో రాజశేఖరరెడ్డి, వైస్ ప్రిన్సిపల్, పి. కిషోర్, ఎంబీఏ విభాగపు అధిపతి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభకు తరలి రావాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ సభకు తరలి రావాలని కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపల్లి మండలం చింతకుంటలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచంలోనే కనివిని ఎరుగని రీతిలో 12 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్న బీఆర్ఎస్ చరిత్రలో నిలిచి పోనుందన్నారు. వరంగల్ సభా వేదికగా కేసీఆర్ ప్రజలకు విశ్వాసం కల్పించనున్నారన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు పైడిపాల సతీష్, యువజన విభాగం మండల అధ్యక్షుడు గుర్రాల జయప్రకాశ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రేణిగుంట రాజు, మైనార్టీ విభాగం అధ్యక్షులు సయ్యద్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పాకిస్తాన్ దేశీయులు ఎవరూ లేరు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో పాకిస్తాన్ దేశీయులు ఎవరూ లేరని రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికను శుక్రవారం పంపించారు. తెలంగాణలో పాకిస్తాన్ జాతీయులను గుర్తించి స్వదేశానికి పంపించాలని కేంద్రం నుంచి రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో జిల్లాలో స్పెషల్ బ్రాంచి పోలీసులు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా సమాచారం సేకరించి పాకిస్తాన్‌కు చెందిన పౌరులు జిల్లాలో లేరని నివేదికను పంపించారు.

బీర్ల అయిలన్నకు మంత్రి పదవి ఇవ్వాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఉన్నందున బీసీ సామాజిక వర్గం నుంచి పశుసంవర్ధక శాఖ మంత్రిగా ఆలేరు శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలన్నకు పదవి ఇవ్వాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ కోరారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీర్ల అయిలన్న సర్పంచ్ స్థాయి నుంచి ప్రజా సేవలో పని చేశారన్నారు. బీర్ల ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ పార్టీ క్రమ శిక్షణకు కట్టుబడి పనిచేస్తున్నట్లు చెప్పారు.

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడికరీంనగర్‌జిల్లా నుంచి మహాత్మా జ్యోతిబాఫూలే విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటినట్లు ఆర్‌సివో అంజలి తెలిపారు. తిమ్మాపూర్‌లోని ఎంజేపీబాలికల కళాశాల నుంచి ఎంపీసీ మొదటి సంవత్సరం పరీక్షఫలితాల్లో సింగం హరిణి(467/470), బండి శ్రీజ(466/470) రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో హెచ్‌ఈసీ విభాగంలో పి శ్రవంతి(964/1000), పి అక్షర(961/1000) మార్కులలు, ఎంఈసీ విభాగంలో ఎస్ సాయి చందన (977/1000) మార్కులు సాధించినట్లు తెలిపారు. మానకొండూర్ జ్యోతి బాపూలే కళాశాల నుంచి ఎంపీడబ్ల్యూహెచ్ విభాగం ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జి.వైష్ణవి (981/1000) మార్కులు, డి.శ్రుతి(983/1000) మార్కులు సాధించినట్లు తెలిపారు. కరీంనగర్‌లోని శర్మనగర్‌లో గల జ్యోతి బాపూలే బాలికల కళాశాలనుంచి బైపీసీ విభాగంలో మొదటి సంవత్సరలో(437/440), ఎస్ శ్రీనిధి(436/440) మార్కులు సాధించినట్లు తెలిపారు. హుజురాబాద్ బాలికల కళాశాల నుంచి ఎంపీసీ విభాగంలో మొదటి సంవత్సరంలో ఈ.అక్షిత (466/470), ఎంపీసీలో ద్వితీయ కే.మమత (994/1000) మార్కులు సాధించినట్లు తెలిపారు.

రాజీవ్ యువ వికాసానికి 4647 దరఖాస్తులు

మానకొండూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం కింద మానకొండూర్ మండలంలో 4647మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీలు 1322, ఎస్టీలు 42, బీసీలు 3055, ఈబీసీలు 122, ముస్లిం మైనార్టీలు 103, క్రిస్టియన్ మైనార్టీలు 3 మొత్తం 4647మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాన్ని మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.50వేల యూనిట్‌కు 100శాతం సబ్సిడీ, రూ.50వేల నుంచి లక్ష వరకు 90శాతం, లక్షనుంచి రూ.లక్షల వరకు 80 శాతం, రూ.2లక్షల నుంచి రూ4లక్షల వరకు 70శాతం సబ్సిడీతో వివిధ బ్యాంకుల ద్వారా రుణాన్ని మంజూరు చేస్తారు. రెండు మూడు రోజుల్లో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. జూన్2న ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు.

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని కమాన్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులను, సంస్థలను గుర్తించడంలో గూఢచర్య వ్యవస్థ విఫలం చెందిందన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

● **రూ.35,726 రికవరీకి ఆదేశం**

రామడుగు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 15వవిడత చేపట్టిన ఉపాధిహామీ పనులకు గాను సామాజికతనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరంలో చేపట్టిన 4,87,66,027 రూపాయల ఉపాధిహామీ పనులకు సామాజిక తనిఖీబృందం గ్రామసభల్లో సేకరించిన వివరాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఆర్డీవో వేణుమాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అన్ని గ్రామాల్లో చేపట్టిన పనులపై ఆరాతీశారు. వివిధ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి మేట్లు కొలతలలో వ్యత్యాసం రావడంతో వారు ఫైన్ చెల్లించాలని ఆదేశించారు. అలాగే వివిధ గ్రామాల్లో కొలతల్లో వ్యత్యాసం, కొట్టివేతలు చేయడం ఉండడం గుర్తించిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల నుంచి 35,726 రూపాయల ఫైన్ విధించారు. సంబంధిత ఫైన్‌ను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. బాధ్యతగా పనిచేయాలని లేకుంటే ఇబ్బందులు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనిల్, ప్రకాష్, ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల, ఎంపీడీవో రాజేశ్వరి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ప్యాక్స్ చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, ఓపీవో రాధ, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



రామడుగు ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

లీకైన పైప్‌లైన్.. పట్టించుకోని అధికారులు

మానకొండూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని వాటర్ ట్యాంకు వద్ద పైప్‌లైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. నీరంతా రోడ్డు వెంబడి ప్రవహించడంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్ లీకేజీతో నీరంతా కలుషితం అవుతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతు చేపట్టి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆలయ భూములకు వేలం

రామడుగు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాల అనుసారం మండలంలోని గుండి గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయ భూములను కౌలుద్వారా సేద్యం చేయుటకు శుక్రవారం బహిరంగవేలం నిర్వహించారు. ఈ వేలంలో వివిధగ్రామాల ప్రజలు పాల్గొనగా 10ఎకరాలకుగాను 5,31,500రూపాయలు కౌలు ద్వారా దేవాలయానికి ఆదాయం వచ్చిందని ఈవో మారుతి తెలిపారు. కౌలుభూమి కాలపరిమితి రెండు సంవత్సరాలు మాత్రమే ఉంటుందని తెలిపారు.

కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని నిరసన

గంగాధర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాకార్యకర్తలపై దౌర్జన్యాన్ని నిరసిస్తూ గంగాధరలో ఆశాకార్యకర్తలు కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు తమకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన


మానకొండూర్‌లో మసీద్ ఎదుట నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు


హుజూరాబాద్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న డాక్టర్లు

మానకొండూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తు మానకొండూర్‌లో ముస్లింలు నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన వ్యక్తం చేశారు. మానకొండూర్‌లోని జామామజీద్ ముందు ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉగ్రదాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫోద్దీన్ మాట్లాడుతూ దేశంలో హిందూ, ముస్లింలు కలిసిమెలిసి జీవిస్తున్నారని అన్నారు. ఇలాంటి ఉగ్రదాడికి భారతీయ ముస్లింలు వ్యతిరేకమని అన్నారు. ఈ ఘటనలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తూ, గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని అల్లాను ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి సయ్యద్ సిరాజొద్దీన్, సభ్యులు ఎండీ గౌస్‌ఖాన్, ఎండీ అమీరుల్లాఖాన్, సాదక్‌పాషా, ఫరీదోద్దీన్, అల్తాఫ్, సయ్యద్ హమీద్ అలీ, ముస్లింలు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద పహల్గాంలో మృతిచెందిన వారికి సంతాపంగా శుక్రవారం రాత్రి ఐఎంఏ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ డివిజన్ అధ్యక్షుడు అంకం సుధాకర్, కోశాధికారి తొగరు విద్యాసాగర్, కార్యదర్శి ఉడుగుల సురేష్, వైద్యులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు ఘనంగా నివాళులు అర్పించారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

టూరిస్టులపై ఉగ్రవాదులుచేసిన దాడి పిరికిపంద చర్య అని గోసంరక్షణ, బీజేపీ సీనియర్ నాయకుడు కాశెట్టి కుమార్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. ప్రశాంతంగాఉన్న దేశంలో ఉగ్రవాదులు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు.

నేడు చొప్పదండి బంద్‌కు పిలుపు

చొప్పదండి: కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా శనివారం చొప్పదండిబంద్‌ను పాటించాలని హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ప్రజలు, వ్యాపారులు రాజకీయాలకు అతీతంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

విజయవంతం చేయాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంనుంచి 50వేల మందిని రజతోత్సవసభకు తరలించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు.

తెలంగాణ ప్రజాఫ్రంట్ కమిటీ సమావేశం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని విజడమ్ జూనియర్ కళాశాలలో కరీంనగర్ జిల్లా తెలంగాణ ప్రజాఫ్రంట్ 4వ జిల్లాకమిటీ సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతనకమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరెల్లి మల్లాగౌడ్, ప్రధానకార్యదర్శిగా ఆయిందాల అంజన్న, ఉపాధ్యక్షుడిగా అలుగువెల్లి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చేరాలు, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, రవి ఎన్నికయ్యారు.

పరామర్శ

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్‌గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మారముళ్ల కొమురయ్య తల్లి లచ్చవ్వ మృతిచెందగా వారి కటుంబసభ్యులను బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరామర్శించారు. పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ముందస్తు బడిబాట

వీణవంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు, హిమ్మత్‌నగర్, మామిడాలపల్లి గ్రామాల్లో మండల విద్యాశాఖ అధికారి శోభరాణి ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతులను ప్రజలకు వివరించారు. దాదాపు 50మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ముందుకు వచ్చారని తెలిపారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు స్థలాన్ని కేటాయించి నందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి మార్కెట్‌చైర్మన్ కొత్తూరి మహేష్, డైరెక్టర్ చిలుక సంజీవ్‌రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, అనిల్, రవీందర్, స్వామి, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.